## ఉదయం పది గంటలకే భోజనం చేసి పడుకొన్న శ్రీపతికి అప్పుడే మెలకువ వచ్చింది.

నెమ్మదిగా పక్కకు ఒత్తిగిలి బద్ధకంగా కళ్ళు తెరచి రిస్టువాచీలో టైము చూసుకున్నాడు.

"అబ్బా మూడయిపోయిందే" అనుకుంటూనే చుట్టూ చూశాడు భార్య రాణీ కోసం. రాణీ ఎక్కడా కన్పించలేదు. బాబిగాడు మాత్రం ఏవో అట్టపెట్టెలతో రైలాట ఆడుకొంటున్నాడు.

"రాణీ ఏమైంది?" అనుకుంటూ ఎదురుగా వున్న తల్లి గదిలోకి చూశాడు

"ఊహూ. అక్కడ రాణీ లేదు. అమ్మ కూడా లేదు. ఏమయ్యారు వీరిద్దరూ" లేచి చూద్దామంటే బద్ధకంగా అన్పించి అలాగే పడుకునుండిపోయి చూస్తున్నాడు. కడుపులో కరకర ఆకలి వేస్తోంది. ఆదివారం కావటంతో ఇంట్లోనే ఉన్నాడారోజు. ఖాళీగా వుంటే అతనికింకా ఆకలి ఎక్కువైనట్లుగా వుంటుంది. అందుకే ఏదైనా టిఫిన్ చేస్తుందేమోనని రాణీకోసం చూస్తూ పడుకునుండిపోయాడు.

"ఒరేయ్ బాబీ! అమ్మేదిరా?" అడిగాడు ఆటలో నిమగ్నమైపోయిన కొడుకును.

"ఏముందీ మామూలే" అన్నాడు పెద్ద మనిషిలా ముఖంపెట్టి.

"మామూలే" అంటే అర్థం శ్రీపతికి తెలుసు. "మామూలు" అంటే రాణీ, శ్రీపతి తల్లి శాంతమ్మ యెప్పుడూ దెబ్బలాడుకోవడం. అదేం ఖర్మమో ఆ యిద్దరికీ ఏ ఉన్నాక్షణం పడదు. ఎప్పుడూ వొకళ్ళ నొకళ్ళు సాధింపులూ, దెప్పిపొడుపులూ, విసురులూ, చరమాంకంలో కన్నీళ్ళూ, ముక్కు చీదుళ్ళూ, ఎగపీల్పుళ్ళూ. ఒకటి లేక రెండు గంటలసేపు యెడమొహం పెడమొహాలూ ఇదీ వాళ్ళ "మామూలు"

ఈ 'మామూలు'కు ఆరేళ్ళుగా అలవాటు పడిపోయాడు శ్రీపతి. అతను యెప్పుడో ఆదివారం తప్ప ఇంట్లో వుండటం జరుగదు కాబట్టి యెలాగో నెట్టుకొస్తున్నా, ఈ మధ్య ఆ వొక్క ఆదివారాలూ ఇంట్లో ఉండటం కూడా క్రమంగా కష్టమైపోతోంది. అతని వద్దకు తీర్పుకోసం ఇరుపక్షాలూ వస్తాయి. అతను మాత్రం వారిద్దరిమధ్యా సంధి కుదర్చే ప్రయత్నం చేయబోయి విఫలుడవుతుంటటం కద్దు. అతడసలే ఎంతో పేరు మోసిన లాయర్లూ, జడ్జీలు, చివరకు ఆ సుప్రీంకోర్టు జడ్జీలు కూడా వారిరువురికీ తీర్పు చెప్పలేరేమో ననిపిస్తుందతనికి. అందుకే అతను "మీరిద్దరూ ఏమైనా చావండి, నేను మాత్రం మిమ్మల్ని సర్దలేను" అని తన అసమర్థతను ఒప్పేసుకుని బయటకు వెళ్ళిపోతూంటాడు. పోనీ అలా కాకుండా ఏదైనా సవరిద్దామన్నా వాళ్ళ మధ్యలోకి వెళ్ళేటప్పటికి వారిరువురి తీక్షణ వీక్షణాలను తట్టుకోవటం చాలా కష్టమైపోతుందతనికి. వారికి గల పరస్పర ద్వేషాన్ని, కోపాన్ని మధ్యలో ఆపబోయినవారిపై డైవర్ట్ చెయ్యగలరు. "నా చూపు తాకితే తక్షణం భస్మమైపోతావు" అనే కౌశికుడిలా. వారి పెద్ద పెద్ద కళ్ళను మరింత పెద్దవిగాచేస్తూ తీక్షణంగా చూడటంతో ఆ చూపులను తట్టుకోగలిగే గుండె నిబ్బరం శ్రీపతికింకా అలవడలేదు. అందుకే వారి దెబ్బలాట సమయంలో సామాన్యంగా దూరంగానే వుంటాడు. వారి దెబ్బలాట మరీ శ్రుతిమించడంతో రంగప్రవేశం చేస్తూ వుంటాడు. ముక్కు చీదుళ్ళు విన్పించగానే అమ్మయ్య పూర్తవస్తోంది అని తేలికగా గాలి పీలుస్తాడు.

దెబ్బలాట పూర్తయినా, దాని ప్రభావం అక్కడ వాతావరణంపై కాసేపు కూస్తో వుండక మానదు. కార్తీక పౌర్ణమినాటి సాగరంలా భీభత్సంగా చెలరేగిన నోళ్ళు మూత బడిన పిదప అతి ప్రశాంతంగా వున్న వాతావరణంలోకి అడుగు పెడుతూ వుంటే అదికూడా కొంచెం భయంగానే వుంటుంది. ఈ రకమైన దెబ్బలాట వాతావరణం శ్రీపతికి ఆరేళ్ళుగానూ బాబిగాడికి నాలుగేళ్ళుగానూ బాగా పరిచయం. ఈ వాతావరణానికి తండ్రీ, కొడుకుల సాంకేతిక నామం "మామూలు."

ఆరోజు కూడా 'మామూలు' అయ్యేటప్పటికి అరగంట తక్కువ పట్టలేదు. యుద్ధం చేసి అలసిపోయిన సైనికుడిలా రాణీ గది లోపలకు వచ్చింది. ముఖం కందగడ్డలా మారిపోయింది. కళ్ళు బాగా వాచిఉన్నాయి. ముక్కుపుటాలు వేగంగా సాగుతూన్న ఉచ్ఛ్వాస నిశ్వాసలతో అదిరిపోతున్నాయి.

"నా ఖర్మం కాలిపోయి ఈ కొంపలో పడ్డాను. ఏమైందని అడిగే దిక్కు కూడా లేదు." వాక్బాణం సూటిగా వచ్చి శ్రీపతి గుండెల్లోకి దిగబడింది.

"ఈ గాలి ఇటు తిరిగిందిలా వుంది" అనుకుంటూన్న శ్రీపతి లేచి ఆవులిస్తూ వళ్ళు విరుచుకొన్నాడు.

తను మాత్రం ఏం చేస్తాడు? ఏమైందని అడగటానికి అక్కడసలు ఏమైనా అవుతేగా. సూది తీసికెళ్ళి దూలానికి గుచ్చినట్లుగా తీరా విచారిస్తే అది చాలా చిన్న కారణం అవుతుందని తనకు తెలుసు. పోనీ చిన్నో, పెద్దో ఏ కారణం అయినా కల్పించుకుని సర్దుదామన్నా ఇద్దరిదీ తప్పుంటుంది వారిలో ఎవరూ అమాయకులు కారు. ఎవరైనా అసమర్థులైతే కదా వారిని వెనకేసుకొని మాట్లాడటానికి. ఇద్దరూ సమఉజ్జీలే అయినప్పుడు, ఇద్దర్లోనూ తప్పున్నప్పుడు తను ఎవర్నని ఏమంటాడు? అందుకే.

"మీ ఇద్దరికీ అసలు బుద్ధుందా? మున్నూట అరవైరోజులూ ఈ శాపం ఇలా వెలిగిపోవలసిందేనా! ఛీ ఛీ ఈ కొంపలో ఒక్క ఆదివారం రోజు కూడా వుండటం కష్టమైపోతోంది వెధవ కొంప. గలేజా మనుష్యులైపోయారు నా ప్రాణానికి. ఒక్క నిమిషం గట్టిగా మాట్లాడితే నాకు దవడలు నీక్కుపోతాయే, అంతంతసేపు అరచుకోవటానికి మీకు నోళ్ళెలా

### తేడా

సమస్యలూ ఈగలూ
అన్నం చుట్టే తిరుగుతాయి
అయితే ఒకటే తేడా!
అన్నం ఉంటే ఈగలు
లేకుంటే సమస్యలు!

—స్వర్గీయ నూతలపాటి గంగాధరం

*ప్రతి యింట్లో అత్తా కోడళ్ళ తగూ మామూలే. ఆ మామూలు తప్పించడానికి చేసిన ప్రయత్నం తర్వాత యేర్పడిన పరిస్థితి యింకా దుర్భరమైతే దాన్నేమనాలి?*

# మామూలే

భాగవతుల వెంకటలక్ష్మి



నెప్పులు పట్టటంలేదూ? ఎవరన్నా విన్నా కూడా అసహ్యం. ఇక నుంచీ మీ దెబ్బలాటలు మానకపోతే నే ఉరిపోసికొని ఛస్తా" అని జాయింటుగా తిడుతూ వుంటాడు.

అప్పుడు కూడా ఒకసారి ఇద్దర్నీ పట్టుకుని దులిపేద్దామనుకున్నాడు. కానీ అసలే ఆకలేస్తూ వుండటంతో తన కంఠశోష కూడా అనవసరమే అని ఊరుకొన్నాడు. తనెంతసేపు బుద్ధి చెప్పినా కుక్కతోకలా వాళ్ళబుద్ధి వక్రమే. అందుకనే ఆ ప్రయత్నం మానుకున్నాడు శ్రీపతి.


"రాణీ, నా కాకలేస్తోందికానీ యేదైనా టిఫిన్ చేద్దూ" అన్నాడు బ్రతిమలాడుతున్నట్లు, జరిగిందంతా మరచి పోమ్మన్నట్లు.

ఒక్కక్షణం భర్త ముఖంలోకి చూసి యేమనుకుందో యేమో వంటింట్లోకి వెళ్ళిపోయింది రాణి

"మౌనం అంగీకారం" కాబట్టి చేస్తుందిలే అని ధైర్యం తెచ్చుకొన్నాడు శ్రీపతి.

బద్ధకంగా వుండటంతో దొడ్లో నూతి వద్ద ముఖం కడుక్కుందామని వెళ్తాండగా సన్నజాజి పందిరి నీడలో వాల్చిన కుక్కిమంచంలో వ్రేళ్ళాడుతున్న శాంతమ్మ గారు సన్నగా ఏదో గొణుక్కుంటూ ఉండటం చూశాడు. ఆవిడ పేరుకు శాంతమ్మే కానీ శాంతం ఏ కోశానా కన్పించదు. ఆవిడ రోజూ పడుకునే మంచం కుక్కిగా వ్రేల్లాడుతూంటుంది కానీ ఆవిడ మనిషి, మాటా, తనువూ, మనసూ అన్నీ దృఢంగా వుంటాయి. అరగంటసేపు అనర్గళంగా దెబ్బలాడగల వాగ్ధాటి. ఎప్పటివో ఎత్తి దెప్పి పొడవగల సమయస్ఫూర్తి. ఎనభై ఏళ్ళ క్రితం జరిగిన సంఘటనలు కూడా గుర్తు తెచ్చుకొని అవసరానికి వాడుకొనే జ్ఞాపకశక్తి, భగవంతుడామెకు ప్రసాదించినవరాలు. పెద్దదాన్నయి పోయాను. కళ్ళు ఆనవు. చెవులు వినపడవు" అనంటుందికానీ ఆమడ దూరం కూడా దృష్టి సారించి సునిశితంగా పరీక్షించగల దావిడ. ఇంటి మొత్తంలోన ఏ మూల ఎక్కడ కోడలెవరితో ఏం మాట్లాడుతోందోనని యావగా వినగలదు.

ముఖం, కాళ్ళూ, చేతులూ కడుక్కుని అక్కడే ఉన్న బల్లపై కూర్చున్నాడు శ్రీపతి. పొగలు గ్రక్కుతూన్న వేడి ఉప్మా రెండు ప్లేట్లతో తీసికొచ్చింది రాణి. ఒకటి శ్రీపతికిచ్చి, రెండవది అత్తగారి ముందుపెట్టి లోపలి కెళ్ళి పోయింది. శాంతమ్మ ప్లేటు చేతిలోకి తీసికొని



ఉప్మా తినసాగింది. దెబ్బలాట అయిన తర్వాత ఒక పూటంతా వారిద్దరూ అంతే. మూగనోము పట్టినట్టుగా మాట్లాడకుండానే పన్లు గడిపేస్తారు. వాళ్ళ దెబ్బలాట ప్రభావం దైనందిన కార్య క్రమాలపై ఏమాత్రం కలుగకపోవటం "కాస్తనయమే" అని సంతోషిస్తూ వుంటాడు శ్రీపతి. మరుపూటకు ఇద్దరూ ఆ వాతావరణం నుంచి కాస్త తేరుకొని మాట్లాడుకొంటూ వుంటారు. అయితే మాత్రం ఏంలాభం? కొంచెం సర్దుకొంది ఫరవాలేదు అనుకొనే లోపలే మళ్ళియుద్ధం ప్రారంభం అవుతుంది.

"మా వాడి కోపం రానేరాదు. వస్తే మూన్నెల్లకొకసారి వస్తుంది. ఆర్నెల్ల పాటు వుంటుంది" అన్నట్లుండేవి వారిద్దరి మధ్య దెబ్బలాట.

*  *  *

ఒక రోజు వుదయం శ్రీపతి షేవ్ చేసుకుంటూ వుండగా ఎప్పుడు మొదలైందో ఎందుకు మొదలైందో అర్థంకాలేదు కానీ నిమిషాలమీద అత్తా కోడళ్ళమధ్య నిప్పు రాజుకుపోయింది మొదటో కాస్సేపు నాకెందుకులే" అని ఊరుకున్నా రానురానూ పెరిగిపోయిన స్వరాలస్థాయి అతన్నలా తేలికగా వుపేక్షించ నివ్వలేదు అర్జంటుగా వున్నపళాన రంగంలోకి దూకాల్సి వచ్చింది. షేవింగ్ మధ్యలోనే అసలైన రంగస్థలం మీదకు వచ్చేశాడు.

శ్రీపతి వచ్చే టప్పటికి ప్రతిపక్షాలు రెండూ పైట చెంగులు దోపి యెదురెదురుగా నిలిచి రౌద్రావేశాలతో ఊగిపోతున్నారు. శాంతమను చూస్తుంటే అలనాటి సక్కుబాయి అత్తగారు జ్ఞాపకమొచ్చింది. రాణి మాత్రం సక్కుబాయి కాదు. సక్కుబాయి అత్తగారికే అత్తగారని చెప్పవచ్చు.

రాణి నా స్థితిలో చూస్తుంటే నరకాసుర వధ సమయంలో శ్రీకృష్ణుని ప్రక్కన నిలబడిన సత్యభామాదేవిలా అగుపించింది శ్రీపతికి. సత్యభామ ఆగ్రహావేశాలు లోకకల్యాణ కారణమైంది. కాని ఈనాటి రాణి ఆగ్రహం గృహ కల్లోలాలకు దారితీస్తోంది.

"ఏం తెచ్చావే వట్టి కట్టుబట్టలతో కాపురానికి వచ్చి ఎక్కడలేని రాజసం ఒలకబోస్తావేమే!" శాంతమ్మ దెప్పిపొడుపు.

"ఆ, ఆ ఎవరెవరేమాత్రం తీసుకొచ్చారో నాకు మాత్రం తెలియదా" రాణీ సమాధానం.

"ఏం తీసుకొచ్చినా నీకంటే చాలా నయం."

"మీ గొప్పతనం, మీ పుట్టింటి వారి గొప్పతనమే చెప్పుకోవాలి. పురిటికొచ్చిన కూతురి గొలుసు తాకట్టుపెట్టి అదీ విడిపించలేక గుట్టుచప్పుడుగా ఇత్తడి గొలుసు చేయించి తరువాత అది బయటపడితే మాకు తెలియదు పొమ్మన్నారు. కూతురి సొమ్ము కాజేసిన వాళ్ళెంత గతిలేనివాళ్ళో" ఎవరివల్లనో తెలిసిన రహస్యాన్ని కుండబద్దలుకొట్టినట్టు బైటపెట్టేసింది రాణి. తన గుట్టు మరీ బైట పెట్టెయ్యడంతో శాంతమ్మ లోని అహం చిందులు తొక్కింది.

'ఏం వాస్తున్నావేచిన్నంతరం, పెద్దంతరం లేకుండా, మా వాడ్ని పిలుస్తానుండు.' తన వెనుకే ఒక రసవత్తరమైన ఘట్టాన్ని తిలకిస్తున్న ప్రేక్షకుడిలా నిలబడిపోయిన శ్రీపతి ఉనికిని గమనించని శాంతమ్మ దాదాపు అరచినట్టుగా మీదమీదకు వచ్చి ఉరిమింది.

"పిల్చుకోండి" ధీమాగా అన్నది రాణి.

"అవునులే నీకసలు మొగుడనే భయం ఉంటేగా. పిల్చుకోండిట. పిల్చుకోండి. ఎంత ధైర్యం నంగనాచికి?"

"జాగ్రత్తగా మాట్లాడండి నంగనాచి, బుంగబూచి అంటారేమిటి?"

"అంటానే. నా ఇష్టం వచ్చినట్లు అంటాను. ఏం చేస్తావే?" శాంతమ్మ కళ్ళల్లో నిప్పులు కురిపిస్తూ గొంతుక చించుకుంటోంది.

ఇంకా వుపేక్షిస్తే వాళ్ళిద్దరూ కలియబడే ప్రమాదంకూడా రావచ్చునని భయపడిన శ్రీపతి.

"ఇదిగో అమ్మా రాణీ మీరిద్దరూ మీమీ పుట్టిళ్ళనుంచి రకరకాల, ధన కనక వస్తు వాహనాల నన్నింటినీ తీసికొచ్చారు కాబట్టే, నేనింత కుబేరుణ్ణయ్యాను. ఒక్కళ్ళ సంగతి వాకళ్ళు వొప్పుకోకపోయినా మీ ఇద్దరి ఘనతానే నొప్పుకొంటున్నానుగా. ఇహ చాలించండి వెధవ గొడవ. ఇంకా పూర్తిగా తెల్లారిందో లేదో కొట్టుకు ఛస్తున్నారు." అతని గర్జనలతో తాత్కాలికంగా ఆగింది వాళ్ళ ప్రళయం.

షేవింగ్ పూర్తిచేసికొని స్నానం ముగించి బయటకు వచ్చాడు అశాంతిగా. వీధి తలుపు తీసికొని వెళ్ళబోతూన్న


ఋణం

వ్యాపారాభివృద్ధి కోసం ఆకర్షణీయమైన షరతుల మీద భవనం, వ్యాపారం, షాపులు, భూములు, థియేటర్లు, లిమిటెడ్ కంపెనీలు, పరిశ్రమలు వగైరాలపై రు. 20,000 లేక ఆపైన ఋణం లభించును.

వ్రాయండి లేదా సంప్రతించండి. ఫోన్ : 395126

SUPREME CORPORATION (BANKERS)
F-15 "EVEREST" 7th Floor, Near Famous cine laboratory,
Tredeo Road, BOMBAY-400 034.

ఉత్తర ప్రత్యుత్తరాలు ఇంగ్లీషులో

సంప్రదాయ మాధురి

## మందార మకరందం

శ్లో॥ తులేన కించిత్ తులయాచ కించిత్
మానేన కించిత్ శపథేన కించిత్।
కించిచ్చ కించిచ్చ హరత్య శేషం
వణిక్సమో నాస్తి ప్రశస్త చోరః॥

త్రాసులో కొంత, తూకంలో కొంత, కొలతలో కొంత, ఒట్లు పెట్టుకుంటూ కొంత- యిలా కొంతకొంత కాజేసి చివరకు యేమీ మిగలకుండా చేసే వ్యాపారిని మించిన దొంగ మరొకడుండడు.

శ్రీపతి "మాష్టారూ" అన్న పిలుపుతో వెనక్కు తిరిగాడు.

ఆయన ఇంటి యజమాని.

'అద్దెకు ఇంకా నెల పూర్తవలేదుగా' అనుకుంటూనే "ఏమిటండీ" అడిగాడు శ్రీపతి.

"ఒకసారిలా వచ్చి కూర్చోండి మీతో ఒక్క నిమిషం మాట్లాడాలి" అన్నాడాయన తన వరండాలో కుర్చీ చూపిస్తూ.

"ఒక్క నిమిషం కాకపోతే పది నిమిషాలు మాటాడండి" అనుకుంటూ ఆయన చూపించిన కుర్చీలో కూర్చున్నాడు శ్రీపతి.

"చూడండి. మీరు మరో విధంగా భావించకపోతే మీ యింట్లో ఆడవాళ్ళు దెబ్బలాటుంది చూశారు. అది మాకు చాలా ఇబ్బందిగా వుంటోంది. ప్రక్క ప్రక్క పోర్షన్ అవటంతో మాకు మరీ చెవిలో కొట్టినట్లుగా వినిపిస్తోంది. మా పిల్లలు చదువుకు కూచున్నా వాళ్ళ దృష్టి అంతా ఆ దెబ్బలాటపైపే డైవర్ట్ అయిపోతోంది. బోలెడు ఫీజులు పోసి నా పిల్లల్ని చదివించుకొంటున్నానుకదా వాళ్ళ చదువులు సాగకపోతే ఎలా చెప్పండి? మీరు ఏదైనా ఇండిపెండెంట్ పోర్షన్ తీసికొంటే మీకు బాగా వీలుగా వుంటుంది."

ఉచిత సలహాతో సహా చావు కబురు బైట పెట్టాడు యింటి ఓనరు.

తను కూర్చున్న చోట భూమి రెండుగా చీలిపోయి సజీవ సమాధి అయిపోతే బాగుండు ననిపించింది శ్రీపతికి. అవమాన భారంతో చితికిపోతూ "అలాగంటె యెలాగండీ. నేను మా వాళ్ళను కంట్రోలు చేస్తాగా. విశాఖవంటి సిటీలో యిళ్ళు అంత తొందరగా దొరకవన్న విషయం మీకూ తెలుసుగా" మరో మాటకు తావివ్వకుండా త్వరత్వరగా బైటకు నడిచాడు.

రోడ్డుమీద యాంత్రికంగా నడుస్తున్న శ్రీపతికి ఆలోచనలు సుళ్ళు తిరుగుతున్నాయి. "కంట్రోలు చేస్తానని మాటిచ్చాను కానీ అది నా సాధ్యమా?" అనుకున్నాడు. అప్రయత్నంగా అతని దృష్టి బుక్ స్టాల్ వద్ద నిల్చున్న గోపీపై పడింది

గోపీకృష్ణ. శ్రీపతి కాలేజీలో చదువుకొనే రోజులనుండీ స్నేహితులు. వట్టి స్నేహితులు అనేకంటే ప్రాణ స్నేహితులంటే బాగుంటుంది. చదువులు అయిపోయినా కూడా ఉద్యోగరీత్యా కూడా ఇరువురూ ఒకే ఊళ్ళో స్థిరపడటంతో వారి స్నేహాని కేవిధమైన ఆటంకమూ కలగలేదు. వారికి వీలైనప్పుడల్లా తరచుగా కలుసుకొంటూనే వుండేవారు. ఒకరి కష్ట సుఖాల నొకరు చెప్పుకొంటూ సలహాలను పొందుతూ వుంటారు. అందుకే గోపీని చూడగానే శ్రీహరి ముఖం విప్పారింది. దగ్గరకు వెళ్ళి :

"ఏమిట్రా విశేషాలు? ఈ మధ్య వారం రోజులై కనపట్లంలేదు" అన్నాడు.

"ఏమీ లేదురా. నాన్నగారికి కొంచెం సుస్తీగా వుంటోంది. నువ్వేమిటి అలా వున్నావు? ఆముదం తాగిన ముఖం నువ్వూనూ" అడిగాడు గోపీ

"అది కాదురా. నేనొక ప్రోబ్లమ్ కి సొల్యూషన్ దొరకక ఛస్తున్నానురా నువ్వేదైనా వుపాయంవుంటే చెప్పరా" ఆశగా అడిగాడు శ్రీపతి.

"ఏమిట్రా?"

"అది కాదురా. మా ఆవిడా, మా అమ్మా యెప్పుడూ దెబ్బలాడుకొంటూ వుంటారు నాకున్న సినిమా పరిజ్ఞానంలో చెప్పాలంటే ఛాయాదేవి, సూర్యకాంతం అదేదో సినిమాలో దెబ్బలాడుకున్నారే అలా - అలా దెబ్బలాడుకొంటార్రా. పోనీ ఇద్దర్లో ఎవరినైనా విడిగా ఎక్కడికైనా పంపించేద్దామంటే, మా రాణీకి పుట్టింటివైపు రెండో దిక్కు లేదు. మా అమ్మకూ ఇంకో స్థానంలేదు. పుట్టింటి వైపు ఎవరూ ఎలానూ లేరు, ఈవిడే కదా మనకు పెద్దదిక్కు" అన్న జ్ఞానం దానికీ లేదు, "కోడలైనా, కూతురైనా అదేకదా" అన్న వివేకం మా అమ్మకూ లేదు. క్లాసులో నా ఎత్తుస్టూడెంట్స్‌ను కంట్రోలు చెయ్యగల్గుతున్నానుకాని, ఆఫ్టరాల్ ఇద్దరాడవాళ్ళను అదుపులో పెట్టలేకపోతునానురా. ఎవరైనా ఇంటగెలిచి రచ్చగెలవాలంటారు. నేను రచ్చగెలిచినా ఇంటగెలవలేకుండా వున్నాను. ఈ విషయంలో నా మగతనం నన్ను సవాల్ చేస్తున్నట్లుగా వుందిరా. కానీ వాళ్ళ నదుపులో పెట్టలేని ఓటమి నంగీకరించాలంటే నా మనసొప్పుకోలేకపోతోందిరా" తన ఆప్తమిత్రుడితో మొర పెట్టుకున్నాడు శ్రీపతి

ఒక నిమిషం ఆలోచించి గోపీ "ఒరేయ్ ఒక పని చెయ్యరా. ఒక పది రోజులపాటు నువ్వు మా ఇంట్లో అజ్ఞాతవాసం చెయ్యి. నేవెళ్ళి "మీ అబ్బాయి సన్యాసుల్లో కలిసిపోతానన్నాడు. అతనికెందుకో విరక్తి పుట్టింది. సంసారం సాగరం దుఃఖం అంటూ వెళ్ళిపోయాడు" అని ఉన్నవీ



జయప్రద
ఫైనాన్స్ సిండికేట్
మెయిన్‌రోడ్, రాజమండ్రి-1




"కళాసాగర్" మద్రాసు కలైవాణర్ అరంగం (ఏ.సి.)లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో "శివలీలలు" నృత్యంచేస్తున్న వసంతలక్ష్మి. నరసింహాచారిదంపతులు

లేనివీ కల్పించి చెప్తాను. వాళ్ళల్లో ఏమైనా మార్పు వస్తుందేమో చూద్దాం" అన్నాడు.

"ఒరేయ్. అలాక్కాదురా. నేనేమై పోయానో నీక్కూడా తెలియనట్లు వాళ్ళను కంగారు పెట్టాలిరా"

"సరే వలాగో ఓలాగు నే చెప్తానుగా- నువ్వు మా ఇంటికి పదు." లేందర పెట్టాడు గోపీ.

శ్రీపతికీ సలహా బాగానే ఉందికానీ, గోపీవాళ్ళ ఇంట్లో పది రోజుల పాటు వుండటంఅంటేకొంచెం మొహమాటంగా అనిపించింది. శ్రీపతి సందేహాన్నర్థంచేసి కొన్న గోపీ :

"ఒరేయ్ ఏమిట్రా కొత్తవాడిలా సిగ్గు పడుతున్నావు? మా ఇంట్లో మాత్రం యెవరున్నారు? మా నాన్నగారు సుస్తీ మనిషి. మంచంమీదనుంచి దిగరు మా అత్తయ్య.ఆవిడ దేవుడి పూజలు ఆవిడవే తప్ప యింకోధ్యాస ఆవిడకు పట్టదు మా ఆవిడ పుట్టింటి కెళ్ళింది కదా! ఇహ నీ వునికిని పట్టించుకొనే దిక్కెవరూ అక్కడ?" అనటంతో వెంటనే వొప్పేసుకొన్నాడు శ్రీపతి.

* * *

"ఉదయం వెళ్ళినవాడు మధ్యాహ్నం భోజనానికి యింటికి రాలేదు ఈ రోజు కాలేజీలో యేదైనా అర్జంటుగాపని తగిలిందేమో" అనుకుంది రాణి. కానీ రాత్రికి కూడా అతను ఇంటికి రాకపోవటంతో ఆమెలో భయం, ఆందోళన మొదలైనాయి.

"అత్తయ్యా. ఆయన ఇప్పటి వరకూ రాలేదంటే నాకేమో భయంగా వుంది" రాత్రి పది గంటల వరకు ఎదురుచూసి, చూసి, అత్తగారితో తన అధైర్యాన్ని వెల్లడించిందామె.

"అవునే నేనూ అదే చూస్తున్నాను. వీడెందుకు రాలేదో" పాపం శాంతమ్మ గారు వీధి మెట్లమీదే కూర్చుండిపోయింది.

మర్నాడంతా కూడా శ్రీపతి ఇంటికి రానేలేదు రాణికి. శాంతమ్మకు కంగారు ఎక్కువైపోయింది. రాణీకాలేజీకి బయల్దేరి వెళ్ళింది. అక్కడ కనుక్కుంటే ఆయన శలవు పెట్టేసి వెళ్ళారని చెప్పారు. రాణి గుండెల్లో రాయి పడింది. పుట్టెడు దిగులు, దుఃఖంతో ఇంటికి వచ్చి శాంతమ్మకీ విషయం చెప్పి బావురుమంది. ఆవిడ గుండెలు బాదుకుంటూ "నా బిడ్డ ఎక్కడికి పోయాడోనమ్మా. రెండు రోజులై ఇంటి మొహమే చూడలేదు. తిండి తిప్పలులేక ఎక్కడ తిరుగుతున్నాడో. నా బిడ్డేమైపోయినాడో." ఏడవటం మొదలుపెట్టింది.

ఇంకొక రెండురోజులు అలాగే ఏడుపులతో గడచిపోయింది.

మూడవరోజు గోపీ ఇంట్లోకి వస్తూ కన్పించడంతో అత్తాకోడళ్ళిద్దరికీ సముద్రంలో కొట్టుకుపోతున్న వాళ్ళకు చిన్న ఆలంబన దొరికినట్లుగా సన్నగా ధైర్యం కల్గింది.

శ్రీపతి ఏడీ! కాలేజీకి వెళ్ళాడా?" ఏమీ తెలియనట్లుగా ప్రశ్నించాడు లోపలకు వచ్చి.

"అయ్యో నాయనా. నా బిడ్డ ఏమైపోయినాడో మూడురోజులై కొంపకే రాలేదు. కాలేజీలో అడిగితే శలవుపెట్టేసి వెళ్ళిపోయాడన్నారు. ఎక్కడికెళ్ళినా చెప్పకుండా యెప్పుడూ వెళ్ళేవాడుకాదు. ఇప్పుడెందు కెళ్ళాడు, ఎక్కడి కెళ్ళాడో అంతుపట్టకుండా వుంది. నాయన్నాయనా దేముడల్లే వచ్చావు మావాడి సంగతి కాస్త విచారించు బాబూ. నీ కాళ్ళు పట్టుకొంటాను." భోరు భోరున యేడుస్తూనే గోపీని బ్రతిమిలాడుకొంది శాంతమ్మగారు.

రాణీవైపు చూశాడు గోపీ. ఆమెకూడా బాగా యేడ్చినట్టుంది కళ్ళు బాగా వాచిపోయి యెర్రబారినై. శ్రీపతిగాడి కోసం యెదురు చూడటంతో తిండీ, నిద్రాకూడా లేనట్లున్నాయి. మొహాలు బాగా పది లంఖణాలు చేసినట్లుగా పీక్కుపోయి వున్నాయి.

కొంచెంసేపు ఆలోచించి "ఆ అవునండీ. ఆ మధ్య ఒకసారి కలుసుకున్నప్పుడు 'ఒరేయ్ గోపీ నాకు ఇంట్లో గొడవలతో అశాంతిగా వుంటోంది. సంసారం పట్ల విరక్తి పెరిగిపోయింది. నేను త్వరలోనే సన్యాసుల్లో కలిసిపోతా'నని చెప్పినట్లు బాగా గుర్తు. అప్పుడు వాడ్ని నేను బాగా చివాట్లేశానుకూడా అలాంటి వెధవ ఆలోచనలు మానుకోమని. అవునూ గొడవలన్నాడు. అసలా గొడవలేమిటి? ఇంటి వాళ్ళేమైనా పేచీకోరు మనుష్యులా!" అమాయకంగా అడిగాడు జగన్నాటక సూత్రధారి గోపీకృష్ణ.

అత్తా కోడళ్ళిద్దరూ ఒకళ్ళవంక ఒకళ్ళు బిక్కమొహాలేసి చూసుకొన్నారు. గోపీ చెప్పిన మాటతో వాళ్ళల్లో ఏ మూలో మిగిలిఉన్న ఆ కాస్త ఆశ అడుగంటిపోయింది. ఒకళ్ళనొకళ్ళు గట్టిగా వాటేసుకొని "అత్తయ్యా ఆయన నిజంగా సన్యాసుల్లో కలిసిపోయారేమో" నని రాణి. "అయ్యో. మావాడెంత పని చేశాడే! వాడికా సన్యాసం బుద్ధులన్నీ ఎవరు నూరిపోశాడో వాడమ్మ కడుపు కాలిపోనూ" అంటూ శాంతమ్మ ఘొల్లుమన్నారు.

"ఏమిటోనండీ వాడి మనసు చాలా దెబ్బతిన్నట్లుంది. అటువంటి వాడికా వాతావరణమే బాగుంటుంది. కాదని ఇంటికి తీసికొచ్చినా ఇంటి గొడవలతో మెదడు కూడా చెదిరిపోయే అవకాశం ఉంటుంది." క్రీగంట వారిద్దరి భావాలనూ పరిశీలిస్తూ మరి కొంత ఆజ్యం పోశాడు గోపీ.

"ఆయనింటికొచ్చే అవకాశమే లేదం

టారా!" ఆశగా గోపీ వంక చూస్తూ అడిగింది రాణీ.

"ఏమో వాడెక్కడున్నాడో పట్టుకోవటం అంత తేలిక కాదు." బెట్టుగా అన్నాడు.

"సమయానికి దేవుడల్లే వచ్చారు. ఈ పరిస్థితిలో మీరు మమ్మల్ని వదిలిపెట్టి వెళ్లిపోతే మాకు రెండో దిక్కెవ్వరు? ఏదైనా ఉపాయం ఆలోచించి ఆయన్ను మాకప్పగిస్తే మేము మీకు జన్మంతా ఋణపడ వుంటాం. కాదనకండి. మమ్మల్ని దిక్కులేనివాళ్ళను చెయ్యకండీ" దోసిట్లో ముఖంపెట్టి ఏడిచేస్తోంది రాణీ.

కన్నీరు మున్నీరుగా ఏడుస్తూన్న వారి వైఖరికి కొద్దిగా జాలివేసింది గోపీకి. అయినా ఆ 'జాలి'ని ప్రక్కకు నెట్టి.

"అవునను కోండి. యెలాగో యీ తన పడి వూళ్ళన్నీ తిరిగి వాడ్ని వెతుక్కొస్తా ననుకోండి. మళ్ళీ ఇంట్లో గొడవ అదే మాదిరిగా వుంటే వాడు మళ్ళీ వెళ్ళిపోడని నమ్మకమేమిటి?" ప్రశ్నార్థకంగా ముఖం పెట్టి అడిగాడు.

"లేదండీ. ఇంక ఆయనకు అలాంటి అవకాశమే రాదు. ఆయన మనస్సుకు ఎటువంటి బాధా కలిగించే అవకాశం రాకుండా మా జాగ్రత్తలలో మేముంటాము. ఆయన్నెలాగైనా వెతుక్కొని రండి. మీరు కాదనకండి. ఈ అభాగ్యుల కోరిక నిరాకరించకండి". అతి దైన్యంగా వున్న ఆమెను చూస్తుంటే గోపీకి ఎంత వద్దనుకున్నా జాలి వేస్తూనే వుంది.

"సరే మీరంతగా హామీ యిస్తున్నారు కాబట్టి నా ప్రయత్నంలో నేనుంటాను. ఒక స్నేహితుని కాపురం నిలబెట్టటం కోసం ఆమాత్రం చెయ్యలేనా" తన ఉపకార బుద్ధిని అన్యాపదేశంగా సూచించాడు గోపీ.

"సరే వెళ్ళొస్తానండీ" అని లేచి వెళ్ళబోతున్న గోపీ రాణీ పిలుపుతో వెనక్కు తిరిగాడు.

"ఇదిగో చూడండి. నెలాఖరు అవటం వలన ఇంట్లో కూడా అసలు డబ్బు లేదు. ఈ చిన్న గొలుసు మీ వద్ద ఉంచండి. ఖర్చులకుంటుంది" కళ్ళనీళ్ళతో గొలుసు తీసి గోపీ చేతిలో ఉంచింది.

"గొలుసిస్తున్నారా!" ఆశ్చర్యంగా చూశాడు గోపీ.

"అవునండీ నా దైవం తిరిగి రావాలే కానీ గొలుసెంతలోకి చేయించుకోగలను"

"ఏమిటే నీ గొలుసు తీస్తావు? నా చేతి గాజు ఇస్తానుండు. నీది తీసుకొని మెళ్ళో వేసుకో. శుక్రవారం పూటా మెళ్ళోని గొలుసు తీస్తావేమిటి? నేనా ఏదో ముసలి ముండని. మూల కూర్చునేదాన్ని. నాకింకా ఈ నగలెందుకు? నా కొడుకు నట్టింట్లో తిరుగుతూ కొడుకూ, కోడలూ, పిల్లలతో కళకళలాడుతూ తిరుగుతూంటే నాకు మాత్రం ఇంకా ఏం కావాలి" అంటూ గబగబా తన చేతి గాజు తీసి ఇచ్చింది శాంతమ్మ.

"వద్దత్తయ్యా. మీకు మాత్రం ఏం పది నగలున్నాయని? వున్న ఒక్కజత తీసేస్తే ఇంకేం వుంటాయి. నాకింటారా ఈ గొలుసు లేకపోయినా వుస్తెలతాడుంది గా" అంటూ శాంతమ్మ చెయ్యి పట్టుకుని వారించింది. రాణి. శ్రీపతి వారిరువురి గురించి చెప్పిన మాటలు మనసులో మెదులుతూన్న గోపీ. వారి పరస్పరాభిమానాలను చూసి ఆశ్చర్యపోయాడు

"అసలు ఎవరూ ఇవ్వక్కర్లేదు. వాడ్ని వెతికి తీసికొని రాగలిగితే వాడి వద్దే వసూలు చేస్తా నా బాకీ" అంటూ రెండడుగులు వేసి "మీరు మాత్రం పూర్తిగా ఆశ పెట్టుకోకండి. నా ప్రయత్నం మాత్రం లోపం లేకుండా చేస్తాను" అని చెప్పేసి వెళ్ళిపోయాడు గోపీ.

* * *

"అమ్మా! నాన్నెప్పుడు వస్తారమ్మా? యెక్కడికి కెళ్ళారు?" అని బాబిగాడు అడిగే ప్రశ్నలకు రాణీ. శాంతమ్మ కుళ్ళిపోయే వారు. ఆ రోజుతో శ్రీపతి వెళ్ళి పది రోజులు. "మీరుమాత్రం పూర్తిగా ఆశ పెట్టుకోకండీ" అని గోపీ చెప్పిన దగ్గర్నుంచి "ఇహ మనకెవరూ దిక్కులేరు.


# లైట్ రూఫ్  ఆస్ఫాల్టు రేకులు



కోళ్ళఫారములకొక ప్రత్యేకత, మన్నికలో పేరెన్నికగన్నవి

విదేశ సాంకేతిక సహకారముతో తయారగుచున్నవి.

విదేశములకుగూడ ఎగుమతి చేయబడుచున్నవి.

ఉత్పత్తిదారులు : లైట్ రూఫింగ్సు లిమిటెడ్,
226- లాయడ్స్ రోడ్,
మద్రాసు–600 086.
ఫోన్ నెం. : 810725/6/7

సోల్ డిస్ట్రిబ్యూటర్లు :
(ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, ఒరిస్సా రాష్ట్రములకు)
బాలాజీ & కంపెనీ, పెద్దిభొట్లవారి వీధి,
గవర్నరుపేట, విజయవాడ–2.
ఫోను నెం. : 74979 & 72484

# భేదం

మామిడి పూతను చూస్తూ
మండువేసవి రాబోతున్నదని గునుస్తూ
మనాది పడతాడు పెసిమిస్టు.

ముదిరే ఎండలను గమనిస్తూ
ముందు ముందు మామిడిపండు తినొచ్చని లొట్టలువేస్తూ
మురిసిపోతాడు ఆప్టిమిస్టు.

—భండారు పర్వతాలరావు

---

మనకు మనమేతోడు" అనే భయంకరమైన వూహ వారిద్దరినీ మరింత సన్నిహితులను చేసింది.

ఇప్పుడు రాణీ శాంతమ్మ బాగా సఖ్యతగా ఉంటున్నారు ప్రతి విషయంలో నూ ఇద్దరిదీ ఒకటే అభిప్రాయం. ఏ పనీ చేసినా ఇద్దరూ సంప్రదించుకొని చేస్తున్నారు. అత్తగారు బాధపడినప్పుడు కోడలు ధైర్యంచెప్పి. కోడలు బాధపడుతూంటే అత్తగారు ధైర్యంచెప్పి ఒకళ్ళనొకళ్ళు ఓదార్చుకొంటూ భారంగా రోజులు గడుపుతున్నారు. ఇంట్లో డబ్బులేక చాలా ఇబ్బందిగా ఉండటంతో అన్నంలోకి ఆధరువులూ అంతంత మాత్రంగానే ఉంటున్నాయి.

"ఆ కాస్త కూర నువ్వేసుకోవే. అసలే నువ్వు కూర లేకపోతే తినలేవు" అత్తగారి ఆప్యాయత.

"మీదసలే అంతంత మాత్రం ఆరోగ్యం. మీరేసుకోండి కూర. నేనా చిన్నదాన్ని. ఏది తిన్నా హరాయించుకోగలను" కోడలి అభిమానం.

ఈమధ్య 'మామూలు' జరిగి చాలా రోజులవటంతో బాబిగాడి ఆశ్చర్యం

* *

ఒక రోజు ఆదరా బాదరా పరిగెత్తుకుంటూ వచ్చాడు గోపీ. అతన్ని చూడగానే అత్తాకోడళ్ళిరువురి ముఖాలు వికసించాయి.

"ఏమండీ మీకో శుభవార్త చెప్పనా!"

"ఇంకా ఆలస్యమా. త్వరగా చెప్పు" అన్నట్లుగా చూశారిరువురూ.

"మొన్న ఇక్కడ్నించి వెళ్ళానా. వెళ్ళిన తర్వాత నాకు ఒక ఆలోచన వచ్చింది. వాడు ఏ ఊళ్ళో వుంటాడని వెతకను? అందుకని ముందు పేపర్లో వేయిస్తే వాడి ఆచూకీ తెలుస్తుందని పేపర్లో వేయించాను." ఒరేయ్ శ్రీపతీ. నువ్వు ఇల్లు వదలి వెళ్ళిన పది రోజుల నుంచీ నీ భార్యా, తల్లీ, కొడుకూ నీకోసం అలమటించిపోతూ తిండీతిప్పలూలేక కృశించిపోతున్నారు నీ వెక్కడున్నా వారి తప్పులన్నింటిని క్షమించి తిరిగి రాగలవని కోరుతున్నాను. అని వేయించాను దానికి సమాధానంగా నిన్న నాకో లెటరొచ్చింది" అన్నాడు గోపీ.

"లెటరా! ఏమని? ఎక్కడ్నించీ" ఆత్రంగా ప్రశ్నించారు శ్రోతలిరువురూ. వాళ్ళ ముఖాల్లో సంతోషం వెల్లివిరుస్తోంది

"మరి వాళ్ళకు ప్రత్యేకంగా ఒక బృందం వుంటుండగా వాళ్ళతో కలిసి కాశీ రామేశ్వరం తిరిగి ప్రయాగ చేరుకున్నాడుట నాకు ప్రయాగనుంచి వుత్తరం రాశాడు. 'నాకీ తీర్థయాత్రలలో మునుపెన్నడూ అనుభవించని అవ్యక్తమైన అనుభూతి కలుగుతోంది. సాంసారిక సుఖాలపై ఏవగింపు కల్గిన నాకు ఈ విధమైన అనుభూతిలో భాషకందని ఆనందాన్ని పొందుతున్నాను నా మనసెంతో ప్రశాంతంగా వుంటోంది. నా జన్మ తరించింది. జీవితాంతమూ ఇలాగే గడుపుతూ భగవద్ధ్యానంలో తనువు చాలిస్తాను. ఇంకొక వారం రోజులపాటు ఈ ఊళ్ళోనే వుంటాము. తరువాత ఏ ఊరు చేరుకుంటామో. మా భవిష్యత్కార్యక్రమ నిర్ణయం ఎలా జరుగునో అప్పుడే తెలియదు" అంటూ రాశాడండీ. అని ఉత్తరంలోని విశేషాలను వివరించాడు గోపీ.

"అయితే పద బాబూ నువ్వూ, నేనూ, నా కోడలూ, మనుమడూ బయల్దేరి ప్రయాగ వెళ్దాము. వాడి కాళ్ళా వేళ్ళాపడి 'నాయనా ఇంటికి రారా. నీకీ సన్యాసమేం ఖర్మరా' అని లాక్కొని వద్దాము" శాంతమ్మ ధోరణి చూస్తే నిల్చున్నపాటున బయలుదేరదీసేటట్లుంది.

పాపం కడుపుతీపి ఆవిడెంతతొందర పెడుతోందో అనుకున్న గోపీ "అబ్బెబ్బె- మీరంతా ఎందుకు? నే వెళ్తానుగా. నే వెళ్ళి వాడ్ని బతిమాలి బామాలి లాక్కొని వచ్చే పూచీ నాది. సరేనా" అని అభయహస్తం ఇచ్చాడు. వాళ్ళకు.

* * *

తరువాత మూడవ రోజునే శ్రీపతిని తీసికొని శ్రీపతి ఇంటికి బయల్దేరాడు గోపీ. ఈ పదిహేనురోజులుగా గీసుకోని గడ్డంతో, గోపీవాళ్ళ మేనత్త (విధవావిడ) కట్టుకునే కాషాయరంగుబట్ట పంచెలా కట్టుకొని పైన ఒక కండువా మాత్రం వేసుకున్న శ్రీపతి నిజంగా సన్యాసిలాగానే వున్నాడు.

వాకిట్లోనే కూర్చొని యెదురు తెన్నులు చూస్తున్న అత్తా, కోడళ్ళిరువురూ అంత దూరంలో వస్తున్న గోపీ శ్రీపతులను చూడటంతో ప్రపంచాధిపత్యం పొందినంత సంతోషంతో పొంగిపోయారు. దగ్గరకు వచ్చిన శ్రీపతి వేషాన్ని చూసి అంత సంతోషంలో వున్నా యేవో సన్నగా ముల్లు గుచ్చుకొన్నట్లు బాధపడిపోయారు.

"వచ్చావా బాబూ. ఎన్నాళ్ళైందిరా నిన్ను చూసి ఈ పాపిష్టి కడుపుకు యింత పిండాకూడు తింటున్నానేకానీ నువ్వేం తిన్నావో, లేదోనని నా కడుపు తరుక్కుపోతోందనుకో." ప్రేమగా కొడుకు వంటిపై చేయి వుంచుతూ అన్నది శాంతమ్మ

"చూడరా- రాణి మొహం చూడరా. నీ కోసం ఎలా ద్రిగ్గుళ్ళిపోతోందో!" చల్లగాలి తగిలిన మేఘంలా అత్తగారి సానుభూతి వాక్యాలతో రాణి కళ్ళవెంబడి జలజలా రాలుతున్న అశ్రువులతో శ్రీపతి పాదాలపై పడిపోయింది.

"ఏమండీ మీకిప్పటికైనా మామీద కనికరం కల్గిందా! ఇంకెప్పుడూ ఇలా వెళ్ళిపోవద్దండీ. మేము భరించలేమండీ. మావల్ల ఏదైనా తప్పుంటే ఈ విధంగా మాత్రం ఎప్పుడూ శిక్షింపవద్దండీ" బతిమలాడుతోంది. ఒక్కక్షణం కళ్ళు మూసుకొన్నాడు శ్రీపతి.

"ఏమిటోనమ్మా. నాకీ బంధాలన్నీ మాయగా కన్పట్టుతున్నాయి. ఇదంతా మిథ్య. నువ్వెవరివో.. నేనెవరినో. భగవత్సాన్నిధ్యంలో ప్రశాంతంగా మనుగడ సాగిస్తూన్న నన్ను మళ్ళీ ఈ ఊబిలోకి లాక్కొని వచ్చారెందుకు?" శూన్యంలోకి చూస్తూ అడిగాడు శ్రీపతి.

అతని ధోరణి అత్తాకోడళ్ళిరువురికీ భయోత్పాతకమైంది.

ఒక నిముషం ఆగి

"లే నాయనా. ఎప్పుడనగా అన్నం తిన్నావో. నా చేతుల్తో నా బిడ్డకు పెట్టె

# చిత్ర కవితలు

## పసిపాప యంత్రం

చలనాన్ని కల్గివున్న మాతృదేశాన్ని
నిశ్చలనం చేయచూస్తున్న కుహనా
పాలకులకన్నా
చలనంలేని మాతృమూర్తికి చలనం
వస్తే చాలని చూస్తున్న
పసిపాప మిన్న:

ఎ. సింహాచలం, సీతానగరం

## భావి పౌరులు

చూడుచూడు బాలలు! భావి భరత
పౌరులు!
నీడలేక తోడులేక ఆడ ఈడ ఏదో తిరిగి
సొమ్మసిలి సోలిపోయే అమ్మ స్తనం
కిమ్మదనం తన ఆకలి తీర్చదాయె!
రోదించె శిశువుల రోగాల కొదిలి
జరుపుకోండి ఘనం ఘనం!
అంతర్జాతీయ బాలల దినం!

ఎం. వి. ఎస్. నాయుడు,
సునాబేడా

## నిజం ఎప్పుడూ...

పాప పాలకు వెతుకులాట
పాప తలికి బతుకు వేట
నీ కిదంతా చేదు పాట
నిజం ఎప్పుడూ నిప్పు మూట.

టి. యం. రెడ్డి, ఆదోని

## నమ్మకం లేని మాట!

మహిళా వత్సరం మాసిపోయి మాసం
కాలేదు.
నిరంతరం కొనసాగే ఫుట్ పాత్ ఆడ జీవి
తాల్లో మార్పేమీ రాలేదు.
చీకటి బతుకుల్లో పుట్టిన పాపాలకు, ఆశల
దీపాలకు,
ముక్కు మూసుకు నిలబడిన బాలల
సంవత్సరం.
మాతృత్వపు మమకారాన్నందిస్తుందనడం
నమ్మలేని నిజం!

వానపల్లి విజయలక్ష్మి,
సునాబేడా

## "ప్రశ్న"

సృష్టి హేతువే విధి పాలయిన
ఈ నిష్కృతి లేని "మహోన్నత"
సంస్కృతిలో —
ఆ పసి మోములోని కోట్లాది జటిల
ప్రశ్నలకు
జవాబు వెదికే యువతకోసం —
జవాబు నిచ్చే "రేపటి కోసం"....

"తపన", కర్నూల్

## 'రేపు' కోసం

పడుచు కోర్కెల జనుల జడివాన
నిత్యనివేదనలో
నరుని శాపం, పాపభారం
కన్నెవయసును కలిచివేస్తే
ఆమె కనుల వాలినది నిదురకాదు.

భగ్నజీవిత తమస్సు
పొద్దు పొడవని "జనతా వని"తా
కుడుప బెడితే
ఆమె గ్రోలునది "రేపు"కోసం
నేటి నిత్య నైరాశ్యాల పయస్సు.

యన్వి రమణరావు,
విజయనగరం

డిన్నం పెట్టుకొని ఎన్నాళ్ళైందో? ఆకలేస్తోందా బాబూ?" ఆప్యాయంగా పొట్ట తడిమింది కన్నహృదయం.

"ఆకలా!" విరక్తిగా నవ్వి "ఆకల్ని మరచిపోయి చాలా రోజులైందమ్మా. ఈ క్షుద్బాధ నరికట్టగలిన వాడు ఇంద్రియ నిగ్రహం కలవాడే పరిపూర్ణ స్థాయిని చేరుకోగలడు" అన్నాడు కానీ కాస్త కాఫీ త్రాగితే బాగుండునని పీకేస్తోంది మనసులో.

"అత్తయ్యా-ఆయనేమిటోగా మాట్లాడుతున్నారత్తయ్యా." అంటూ అత్తగార్ని పట్టుకొని బావురుమంది రాణి.

"ఏమిటోనె అమ్మా! మా వాడి ధోరణి నాకూ భయంగానే వుంది" శాంతమ్మ.

"విరాగి"లా కళ్ళు మూసుకొని మాట్లాడుతూన్నప్పటికీ అత్తా కోడళ్ళలో కలిగిన అభివృద్ధి పరిణామాల నెప్పటికప్పుడు ఓరకంట గమనిస్తూనే వున్నాడు శ్రీపతి.

జగన్నాటకంలో తన పాత్ర ముగిసిపోయిందని గోపీ నెమ్మదిగా నిష్క్రమించాడు.

తనాశించిన ఫలితం కన్పించే సూచనలు కంటబడటంతో "ఇహ ఈ నాటకానికి స్వస్తి చెప్పవచ్చు"ననిపించింది శ్రీపతికి.

కేవలం తల్లీ భార్యల బలవంతంమీదనే తను తిని తిరుగుతున్నట్టు నటిస్తూ క్రమంగా మామూలు జీవితంలోకి వచ్చాడు.

*       *       *

వారం రోజుల తర్వాత కాలేజి ఇంటర్వెల్ టైంలో శ్రీపతిని కలుసుకున్నాడు గోపీ

"ఏరా ఏమిటి మన నాటకం ఎంతవరకు ఉపయోగపడింది" ఉత్సాహంగా అడిగాడు.

"ఉపయోగం ఏమిటి బ్రహ్మాండంగా వుంది కానీ ..." ఏమిటో నసిగినట్లుగా అన్నాడు శ్రీపతి.

"మళ్ళీ ఏమొచ్చిందిరా? కానీ అని సస్పెన్స్‌లో పెట్టి చంపక సరిగ్గా చెప్పేడు" అన్నాడు గోపీ.

"అది కాదురా వచ్చిన గొడవేమిటంటే వాళ్ళిద్దరూ మరీ ఒకటైపోతున్నారురా" అన్నాడు అదోలా ముఖం పెట్టి.

"అంటే....అంటే నువ్వనేదేమిట్రా"

"అంటే అదేరా...." చెప్పడానికి కొంచెం సిగుపడుతున్నట్లున్నాడు శ్రీపతి.

"ఒరేయ్ ఫూల్! నా దగర సిగ్గేమిట్రా. సరిగ్గా చెప్పరా."

"అదేరా. అసలు రాణీతో ఏకాంతం కావాలన్నా దొరికి చావటంలేదురా. అసలా అవకాశమే ఈయటంలేదు. పోనీ రాత్రిళ్లయినా సరిగ్గా వుంటుందా అంటే మధ్యలో టక్కున లేచి "అత్తయ్యకు దగ్గు వస్తోందిలా వుంది" అనో."ఇందాక గుండెల్లో నెప్పి వస్తోందన్నారు ఇప్పుడెలావున్నారో చూసివస్తా" ననో లేచి వెళ్ళిపోతూ వుంటుందిరా. నాకు కళ్ళు కూరుకువస్తూ కునికిపాట్లు పడుతూ తనకోసం ఎదురుచూస్తుంటే ఇదిగో ఇలా తిరుగుతూ కాలక్షేపం చేసేస్తుందిరా" తన మనసులోని బాధంతా ఆప్తమిత్రుడితో చెప్పేసుకొన్నాడు శ్రీపతి.

గోపీకి ఏం సలహా ఇవ్వాలో తెలియ లేదులా వుంది. బుర్ర గోక్కుంటూ "ఇదేరా ఆడవాళ్ళతో వచ్చిన చిక్కు. వాళ్ళకు ఏదొచ్చినా పట్టలేం" అన్నాడు.

"ఒరేయ్ గోపీ. అసలు దీనికంటె ఆ'మామూలే బాగున్నట్లుందిరా" అన్నాడు శ్రీపతి అమాయకంగా ముఖం పెట్టి. ●